# ఉపాధ్యాయ ఉవాచ!

"మేష్టరీ అంత సుఖమైన ఉద్యోగం ఈ లోకంలో లేదనుకో!

ఒడిదుడుకులుండవు - కొంపలు మునిగిపోయే కంప్లయింట్స్ రావు, అధికార్ల జులుం అంతంతమాత్రం - అయినా హెడ్ మాస్టర్లూ, ప్రిన్సిపాల్సేగా, ఆ అధికార్లు! పాపం వాళ్ళేం అధికార్లు?

ఇంక పని అంటావా? చెప్పేవి, పాఠాలేగా, కె.జి. క్లాసులో అయినా, పి.జి. క్లాసులో అయినా. అవి వాళ్ళు ఎంత చెబితే అంత. వినని పిల్లలు ఎలాగూ వినరు. బుద్ధిగా వినేవాళ్ళకి వివరాలు తెలియవు. విజ్ఞులెవరూ తరగతుల్లో కూర్చోరు - దాంతో చూసోమరి.

ఫ్రిజ్‌లో పెట్టిన మల్లెపువ్వుల్లా, ఇస్త్రీ మడత నలక్కుండా కడుపులో చల్ల కదలకుండా, దర్జాగా దొర్లించెయ్యొచ్చు రోజులు. పైగా ఏడాదికి మూడు నాలుగు నెలలు శలవులు. అవిగాక ఎండొస్తే శలవు. వానొస్తే శలవు. లోకంలో ఏమూల ఏ చీమ చిటుక్కుమన్నా ఇక్కడ స్ట్రైకూ శలవూను. భలే ఉద్యోగంలే!"

ఈ మాటలు కొందరు పెద్దలనోటంట వింటూఉంటాం అక్కడక్కడ - ఎక్కడో ఎందుకు? కొందరు, ఆ జీవుడి మొహం మీదే అంటూ ఉంటారు. ఆ జీవుడు పాపం చిన్నబుచ్చుకుంటాడనే మొహమాటం ఏం లేకుండా. పై వాళ్ళ మాట పక్కన పెట్టండి, కట్టుకున్న ఇల్లాలే తీసిపారేస్తుంది ఒక్కొక్కప్పుడు 'చాల్లెండి, పెద్ద ఆఫీసు గుమాస్తాలా హడావిడీ మీరూను. ఫస్ట్‌బెల్‌కి వెళ్ళి రెస్ట్ తీసుకోవడమేగా అక్కడ?' అంటూ.

నిజంగా అంతసులువేనా ఉపాధ్యాయవృత్తి? ఏమోమరి! ముప్పై అయిదేళ్ళు ఆ వృత్తి వెలగబెట్టి, ఇప్పుడు వెనక్కి తిరిగి ఆలోచిస్తే నాకు అలా అనిపించడం లేదు. బోనులోంచి బయటపడ్డాం, హమ్మయ్య అనిపిస్తోంది.

ఠంగ్‌మని బెల్లు కొట్టేటప్పటికి టంచన్‌గా క్లాసులో ఉండాలి. కె.జి. క్లాసు టీచరైనా సరే, పి.జి. క్లాసు టీచరైనా సరే. తక్కిన ఉద్యోగస్థుల్లాగ పురపర్యటనా, నగర సంకీర్తనా చేస్తూ కూర్చుంటే లాభం లేదు. అరక్షణం ఆలశ్యం అయిందో, అరవై కంఠాలు, అధికారుల హృదయవైశాల్యాన్ని బట్టి అవి కొండకచో నూట ఇరవై అయినా కావచ్చు - అన్ని కంఠాలూ అన్ని స్వరరాగ తాళ భేదాలతో బెంచీలూ, తలుపులూ వంటి మృదంగ నాదాలతో కలిసి సంగీత కచేరీ చేస్తూఉంటాయి. కూతలు కుయ్యడం, అరుపులు అరవడం తమ జన్మహక్కని మనస్ఫూర్తిగా నమ్మిన ఆ వీరాధి వీరుల మధ్యకి, పద్మవ్యూహంలోకి వెళ్ళే అభిమన్యుడిలా ప్రవేశిస్తే, గౌరవంగా మర్యాదగా ఎప్పుడూ బయటపడతాడనే గ్యారంటీ లేదు ఉపాధ్యాయుడికి. అయినా రోజుకి మూడు నాలుగు పద్మవ్యూహాల్లోకి ప్రవేశిస్తూ ఉండాలి. ప్రవేశించింది మొదలు, బతికిబయట పడేదాకా, తన సంభాషణా సంగ్రామాన్ని అరసెకనుకూడా ఆపకూడదు. ఆపాడో - ఇందాక మనవిచేశానే - ఆ జన్మహక్కులు జ్ఞాపకం వస్తాయి విద్యార్థులకి - అవి వారికి జ్ఞాపకం రాకుండా చెయ్యడంలోనే ఉంది టీచర్ చాకచక్యం అంతా. అందుకు అతను శ్రీమహావిష్ణువు కంటే ఎక్కువ అవతారాలే ఎత్తాలి.

పండితుడు, పరమపవిత్రుడు, దయార్ద్రహృదయుడు, దాసానుదాసుడు, అపరాధ పరిశోధకుడు, నిరపరాధి, న్యాయవాది, విద్వాంసుడు, విదూషకుడు, హరికథ దాసు, సంగీత విద్వాంసుడు - ఇలా అవసరాన్ని బట్టి అష్టాదశ అవతారాలు ఎత్తుతూ, మధ్య మధ్య సమయం సందర్భాన్ని బట్టి, శాంత రౌద్ర హాస్య రసాల్ని పోషిస్తూ, రసభంగం అయే సమయం వస్తే, కళ్ళనీళ్ళు తరవాయిగా కరుణరసాన్ని పోషించి, సంధి సూచకంగా తెల్లజండా బదులు తెల్ల మొహాన్ని ప్రదర్శించాలి. ఇంత హంగామా ఓ పక్క కావిస్తూ, మరో పక్క అక్షరం తప్పురాకుండా, అన్వయ క్లిష్టత ఏర్పడకుండా, అనర్గళంగా, అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు పాఠం చక్కగా బోధపరచి గంట ఇట్టే అయిందనిపించాలి.

ఒక్కొక్కప్పుడు, గంటలు కొట్టే వీరాస్వామికి దయ తప్పితే, అదే గంట, దేవమానంలాగ, గంటా పదినిముషాలో, మరో పదిహేను నిముషాలో అయి ఊరు కొంటుంది. పొద్దుటే ఉపాధ్యాయుడు ఎవరి మొహం చూశాడు అనే దానిమీద, అది, ఆధారపడి ఉంటుంది. అందుకే, మేష్టరీ వృత్తి అనే రోటిక్రింద మెడ పెట్టదలుచుకొన్న ప్రతి మానవుడూ, సదరు వీరాస్వామిగారి నిలువెత్తు ఫోటో ఒకటి సంపాదించి, తన పడగ్గదిలో పెట్టుకుని, లేస్తూనే వారి మొహం చూడ్డం శ్రేయస్కరం అని విజ్ఞుల అభిప్రాయం.

గంటో - గంటంపావో, మొత్తంమీద సర్కస్ ఫీట్ లాంటి, ఆ తతంగం పూర్తిచేసి, హమ్మయ్య అని ఊపిరిపీల్చుకోడానికి వీల్లేదు ఉపాధ్యాయుడు. మళ్ళీ ఇంకో గంట ఇంకో క్లాసుకి వెళ్ళాలి. అక్కడ మళ్ళీ ఇందాకటి సర్కస్సే చేస్తానంటే రక్తి కట్టదు. అక్కడ ఉండే ప్రేక్షకులు వేరు - వారి కోరికలు వేరు. అభిరుచులూ, అలవాట్లూ, ఆశయాలు, అన్నీ వేరుగానే ఉంటాయి. వారి షరతులకి లోబడి, వారి మనస్సులకి నచ్చేటట్లు అక్కడ గజ్జెకట్టాలి. ఇలా చెప్పిన కథ, చెప్పిన క్లాసులో, చెప్పినట్లు చెప్పకుండా, నవనవోన్మేషంగా, నిత్య నూతనంగా, అపర ఆదిభట్ల నారాయణ దాసుగారిలాగ తన సర్వీసంతా గడపాలి - ఏరోజూ కళ తగ్గకూడదు.

ఇంకో సంగతి -

ఉపాధ్యాయుడన్నవాడికి కోపం, తాపం, విసుగూ, విరామం, చిరాకూ పరాకూ వంటి లక్షణాలేం ఉండకూడదు. పరమ సాత్త్వికుడిలాగ, పప్పు సుద్దలాగ, చలిమిడి ముద్దలాగ డైరెక్ట్‌గా ఋషివాటికనుంచి వచ్చిన నిస్సంగునిలా పడిఉండాలి.

ఓ విద్యార్థి అస్తమానూ పక్కన విద్యార్థితో మాట్లాడుతూ ఉంటాడు.

మరొకడు, నీ పాఠం ఎంత, నువ్వెంత అన్నట్లు టీచర్‌వైపు వీపు తిప్పి, బయటున్న సకల చరాచర ప్రపంచాన్నీ తదేక దృష్టితో వీక్షిస్తూ ఉంటాడు.

ఇంకొకడు తాను మహామేధావిననే విషయం, అందరూ, ముఖ్యంగా ఆడపిల్లలు, గమనించాలనే ఉద్దేశంతో, సంబంధంలేని ప్రశ్నలు వేస్తూ ఉపాధ్యాయుణ్ణి వేటాడుతూ ఉంటాడు. ఆ వినోదాన్ని చూసి మిగతా విద్యార్థులు ఆనందిస్తూ ఉంటారు. మరో కుర్రాడు, పాఠం సీరియస్‌గా సాగుతూన్న సమయంలో, ఓ జోకుపేల్చి, నవ్వుల టపాకాయలు అంటించి, క్లాసుని దీపావళిగా మార్చేస్తూ ఉంటాడు. పాఠం కాదు. అటెండెన్సే ముఖ్యం అని నమ్మిన కొందరు విద్యార్థులు, క్లాసులోకి యథేచ్ఛగా ప్రవేశ నిర్గమనాలు సాగిస్తూ ఉంటారు.

ఇలా ఏవేవో జరిగిపోతున్నా, అవేవీ తనకి పట్టనట్లూ, గౌరవ అగౌరవాలు, తిరస్కారపురస్కారాలు, ఇవన్నీ శరీరానికి తప్ప ఆత్మకి అంటవు - అనే గీతా వాక్యాన్ని నెమరు వేసుకుంటూ, టీచర్ అన్నవాడు తన ధర్మాన్ని తను నిర్వర్తించుకుంటూ పోవాలి. అంతేకాని అదేవిటీ అని అడగడం, అలా ఉండకూడదని హితవచనాలు పలకడం, కోపం తెచ్చుకోవడం, మందలించబోవడం వంటి చాదస్తాలకి పోకూడదు.

ఖర్మం చాలక ఎప్పుడేనా, కక్కువస్తున్నట్లు కోపం వచ్చేస్తూంటే, ఒక్క క్షణం

ఆగి, ఈ విద్యార్థి తాలూకు పూర్వాపరాలెట్టివి అని కాస్త ఆలోచించాలి. ఇతను ఊళ్ళో పలుకుబడి గల ఆసామీ కొడుకా? లేక, ఇతని వెనుక, మందీ మార్బలం దిట్టంగా ఉందా? లేక, ఇంతక్రితం ఇతని పాలబడిన ఏమేష్టరైనా బ్రతికి బైటపడ్డాడా? అసలు ఇంతకీ నేను కేకలేస్తే, ఇతను తలవంచుతాడా, నన్నే తలవంచుకొనేలా చేస్తాడా? ఇన్ని సంగతుల్ని చర్చించి, పరిశీలించి, నిర్ణయించుకుంటే తప్ప తొందర పడకూడదు, ఉపాధ్యాయుడనే బడుగు జీవి!

ఇంతగా ఆలోచించి నిర్ణయించుకున్నా, ఒక్కొక్కప్పుడు తన అంచనాలు తారుమారయే ప్రమాదం ఉంది.

ఏయ్! ఏవిటా అల్లరి? నిలబడు అంటే,

నేను నిలబడను అని ఠపీమని రావచ్చు సమాధానం.

అది ఉపాధ్యాయకుడి జీవితంలో క్లిష్టతర కష్టభూయిష్టమైన దుష్టసమయం. అటువంటి సమయాల్లో పట్టుదలకీ, పౌరుషాలకీ పోకూడదు. పోయాడో, తర్వాత వచ్చే ఫలితాలు విపరీతంగా ఉంటాయి. అనక, హెడ్‌మాష్టారో, ప్రిన్సిపాలో, జన బాహుళ్యమో, ఎవరో ఒకరు, లేక అంతా కలిసి ఉపాధ్యాయుణ్ణి మందలించవచ్చు. ఆ మాత్రం లోకజ్ఞతా సమయస్ఫూర్తి లేకుండా ఇలా వ్యవహరించావేమిటి? అని. పోనీ అని బాహాటంగా ఓటమినీ అంగీకరించకూడదు - అంగీకరిస్తే, సమస్త విద్యాలోకానికీ ఉప్పు అందిపోయి, ఆ మేష్టారు మరింత అలుసూ, చులకనా అయిపోతాడు.

అందువల్ల ఓటమిని, విసుగులోకో, కోపంలోకో తర్జుమాచేసి 'నిలబడు!' అని ఎంత గట్టిగా అన్నాడో, అంత గట్టిగానే, 'నిలబడవా? సరే అయితే - కూర్చో' అని అరవాలి. అరిచి, తానే జయించినట్లు, చేతనైతే ఓ చిరునవ్వు నవ్వాలి.

ఇలాంటి సందర్భాల్లో, ఆత్మవంచన, జగద్వంచన, అని ఆలోచించకూడదు. కోపాన్ని బలవంతంగా అణచుకుంటే, బ్లడ్ ప్రెషర్ ఎక్కడ వస్తుందో అని భయపడనూ కూడదు.

అసలు అంతకంటే, భారత రాజ్యాంగంలో పౌరహక్కులు అనే క్లాజు కింద, సబ్‌క్లాజుగా, ఉపాధ్యాయ వృత్తి చేసే పౌరుడికి, ఎట్టి పరిస్థితిలోనూ, కోపం ఆవేశం తెచ్చుకొనే హక్కులేదు అని చేర్చడం మంచిది అని నా అభిప్రాయం.

జలస్తంభన, వాయుస్తంభన లాగ, క్లాసు స్తంభన చేసేసి, పాఠాన్ని అరంగుళం

కూడా ముందుకు జరగనివ్వని విషమ పరిస్థితిని, ఏ విద్యార్థో, లేదా అందరు విద్యార్థులూ కలిసో, కల్పించవచ్చు. అలాంటప్పుడు ఉపాధ్యాయుడు నిగ్రహం కోల్పోకూడదు. అదొక అత్యవసర పరిస్థితి. అట్టి పరిస్థితి ఏర్పడిన సమయంలో మేష్టారు అన్నవాడు, ఎలా ప్రవర్తించాలో బోధించే, నియమ నిబంధనలున్నాయి –

వీలైతే, ఓ చిరునవ్వు – తప్పకపోతే విసుగ్గా ముఖంపెట్టడం కనుబొమలు ముడివేయడం – తెలివి ఉంటే ఓ చురక తగిలించడం – అంతగా శ్రుతిమించితే, పరుష వాక్యం లేని ఓ హితవచనం – అదైనా మితంగా – బస్ – అంతే – ఆపైన వెళ్ళకూడదు.

పై అధికార్లకి రిపోర్టు చేస్తాను, మీ పేరెంట్స్‌కి చెప్తాను వంటి అమాయకపు బెదిరింపులు అస్సలు చెయ్యకూడదు – వాళ్ళెవ్వరూ ఏం చెయ్యలేక చేతులెత్తేసేకదా, ఆ యువశిఖామణిని తన పాలబడేసింది?

ఈ జగత్సత్యాన్ని విస్మరిస్తే ఎలా?

అందువల్ల, ఏతావాతా చెప్పవచ్చిందేమిటంటే, కోపం, పౌరుషం, పట్టుదలా, ఆత్మాభిమానం వంటి పిచ్చి పిచ్చి విషయాల జోలికి పోకుండా, లౌక్యం, లోకజ్ఞతా, సర్దుబాటు మనస్తత్వం వంటి మంచిగుణాలు వంటబట్టించుకొని, కర్మణ్యేవాధికారస్తే మాఫలేషుకదాచన వంటి గీతా వాక్యాన్ని మనసారా నమ్మి, తన విధి తాను నిర్వర్తిస్తూ, ఫలితాల్ని ఆ పరమాత్మకే వదిలేసి, రోజులు వెళ్ళమార్చుకోవాలి, మేస్టరీ వృత్తిని ఒడికట్టిన మానవుడు. పరీక్షా ఫలితాల విషయంలోనూ అంతే – బాగా వస్తే పొంగిపోవడం, లేకపోతే క్రుంగిపోవడం మంచిదికాదు. సార్! మీ దయవల్ల పాసయ్యాను అనే కితాబుని జేబులో వేసుకున్నాడో, సార్! మీ దయవల్ల ఫేల్ అయ్యాను అనే నిష్ఠురవ్వని కూడా వేసుకోవాలి జేబులో – ఏదీ తన దయకాదనీ, తనుకేవలం నిమిత్తమాత్రుడననీ నమ్మాలి – ఆ సంగతి అనుక్షణం మననం చేసుకోవాలి.

ఇలా ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన, సమస్త హంగుల్నీ సమకూర్చుకున్నాం కదా అని సంతృప్తిచెంది, చెప్పే పాఠం విషయంలో ఏమరుపాటు చెందకూడదు. చెందితే, వెనకటికి ఓ మేష్టారు, విహాయసం అనే పదాన్ని వాయసంగా భ్రమపడి కాకి అని చెప్పినట్లవుతుంది. అలా చెప్పి ఒకాయన, కాకి అనే సర్వనామాన్ని స్వంతం చేసుకున్నాడు – సర్వనామాల సంగతి తర్వాత చెప్తాను. ముందిక్కడ, ఉపాధ్యాయుడు ఎల్లవేళలా జ్ఞాపకం ఉంచుకోవలసింది ఏమిటంటే, తాను చెప్పవలసిన పాఠాల్ని ఏ

రోజుకారోజు, ముందుగా, క్షుణ్ణంగా, నిజాయితీగా, ఓమారు చూసుకోవాలి. తనకంటే ప్రతిభగల కుర్రాళ్ళు, ఒకళ్ళో ఇద్దరో, ఎప్పుడూ క్లాసులో ఉంటారని మరిచిపోకూడదు. అంటే, క్లాసుకివెళ్ళే ప్రతిసారీ, కత్తితో బాటు కవచం కూడా అమారుగా సిద్ధం చేసుకోవాలి.

ఇంక సర్వనామాల సంగతి.

ఏ ఉద్యోగస్తునికేనా రెండోపేరు ఉంటుందో ఉండదోకాని, మేష్టరన్న ప్రతివాడికీ రెండో పేరు ఉండి తీరుతుంది – ఆ సంగతి అతనికి తెలియదు. అంతే! కుర్రాళ్ళు తమలో తాము అతణ్ణి ఆ ముద్దుపేరుతోనే పిలుచుకుంటూ ఉంటారు. సర్వనామాల సంఖ్య తగ్గాలంటే, మేష్టారు అనే ప్రాణికి తనవీ అనే సరదాలేం ఉండకూడదు. ఎవరెన్ని వేషాలు వేసినా తనుమాత్రం సాదా సీదాగా ఉండి పోవలసిందే!

బారిష్టరు గారు బారెడు మీసంపెంచుకోవచ్చు. మేనేజర్ గారి మేకప్ కాస్త ఎక్కువైనా, ఛైర్మన్‌గారి చెంపలు చెవులు దాటినా కొంపలు మునిగిపోవు. ఈ విశేషాలే ఉపాధ్యాయుడిలో కనిపించాయో, అవి, విశేషణాలయి ఊరుకుంటాయి అతనిపట్ల. తెచ్చిపెట్టుకున్న వికారాలే కాదు, భగవంతుడు ఏర్పరిచిన అవకారాలకి కూడా అతనే బాధ్యత వహించాలి. అవికూడా వచ్చి అతని నామావళిలో చేరిపోతాయి. 'పోకెట వాచీ' అని పేరున్న మేష్టారికి, పొడుగు ముక్కు అన్న పేరు కూడా వచ్చి కలిసినట్టు – వెనకటికి ఓ మేష్టారు జిహ్వాచాపల్యం చంపుకోలేక, బజార్లో బడ్డీకొట్టు మిరపకాయల బజ్జీలపట్ల ఆకర్షితుడయ్యేసరికి, మర్నాడు ఉదయం, ఆ బజ్జీ కాస్తా వచ్చి బ్లాక్ బోర్డు ఎక్కింది.

దీనివల్ల తేలిన సంగతేమిటయ్యా అంటే, మేష్టరీ వృత్తిలోకి తలదూర్చేవాడు జిహ్వాచాపల్యాన్ని అదుపులో పెట్టుకోవాలి! కోరికల్ని చంపుకోవాలి! వైరాగ్యాన్ని పెంచుకోవాలి!

చూశారా!

కోపతాపాలకి అతీతుడుగా, శక్తి ఉన్నా శాపగ్రస్తుడై పడిఉండే బృహన్నలాగ, తన భావాల్ని బహిర్గతం చెయ్యలేని బాహుకునిగా (నలుని దయనీయరూపం), పాండిత్యం, వాక్చాతుర్యం, లోకజ్ఞతా, సమయస్ఫూర్తీ, నిజాయితీ, లౌక్యం వంటి లక్షలక్షణాల్నీ సమపాళ్ళలో రంగరించుకొన్న తెలివైన అమాయకుడిగా, ఒకే సమయంలో ఎన్నో అవతారాలు ఎత్తవలసిన దయనీయమూర్తిగా, ఎంతో జాగ్రత్తగా బ్రతుకుబండిని

ఈడ్చుకు రావలసిన బడుగు మానవుడు, ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకొనే వ్యక్తి. ఇప్పుడు చెప్పండి – బ్రతకలేకపోతే బడిపంతులా? సుఖంగా బ్రతక దల్చుకోక పోతేనే బడిపంతులా? – అయ్యా! గట్టుమీద ఉన్నవారు ఎన్ని కబుర్లయినా చెప్పండి – నీటిలో ఉన్నవాడిని నేను చెప్తున్నాను వినండి, మీరు అనుకునేటంతటి తేలిక కాదండీ ఉపాధ్యాయ వృత్తి!

(తెలుగు విద్యార్థి, జూలై 2002)

*